క్లుప్తంగా

ఆర్ఐగా మంజుల



వెల్దుర్తి: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా మంజుల శనివారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు కలెక్టర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జ్ ఆర్ఐగా మల్లెపల్లె వీఆర్ఓ ప్రసాద్ వ్యవహరించారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి



ఉపాధి కూలీల మస్టర్‌ను తనిఖీ చేస్తున్న ఏపీఓ రామకృష్ణ

ఆస్పరి: వలసలు వెళ్లకుండా ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ రామకృష్ణ కూలీలకు సూచించారు. శనివారం మండలంలోని జొహరాపురం గ్రామ సమీపలో ఉపాధి పనులను పరిశీలించి కూలీల మస్టర్లును తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కూలీలు అడిగిన వెంటనే పనులు కల్పిస్తామన్నారు. కొత్తగా జాబ్ కార్డు కావాల్సిన వారు ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా బుక్కు జిరాక్సును పంచాయతీ కార్యదర్శికి అందజేస్తే వెంటనే జాబ్ కార్డు ఇస్తామని చెప్పారు.

వీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఆలయంలో కలశ పూజ చేస్తున్న భక్తులు

పత్తికొండ రూరల్ : పత్తికొండలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయం వద్ద పందిరి వేసిన తరువాత ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మయ్యాచారి స్వాములకు గంగపూజ చేసి అభిషేకం చేశారు. గణపతి పూజ, కలశ స్థాపన, నిత్యజప హోమం, బలిహరణ పూజలు చేశారు. సాయంత్రం మృత్సగ్రహణం, అంకురార్పణం చేశారు. ఆలయ ధర్మకర్త ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో ఆయకట్టుదారులు తుప్పద నాగన్న, మారినేని పులికొండ, మల్లికార్జున, లక్ష్మన్న, బారిక గోరంట్ల, తంబళ్ల నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



నగదు అందిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శశికళ

ఆలూరు రూరల్: మండలంలోని అరికెర గ్రామంలోని మాళమల్లేశ్వర స్వామి ఆలయానికి వైఎస్సార్ సీపీ కర్నూలు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శశికళ రూ.11 వేలు విరాళం అందించారు. అరికెర గ్రామంలో ఇటీవల నూతన ఆలయం నిర్మించి, మాళమల్లేశ్వర స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఇందులో భాగంగానే శనివారం ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయానికి నగదు అందించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున, కో-కన్వీనర్ వీరేష్ గ్రామస్తులు ఉన్నారు.

ఈరన్న కుటుంబానికి కుట్టుమిషన్ అందజేత

ఇటీవల హత్యకు గురైన అరికెర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శశికళ పరామర్శించారు. తన వంతుగా ఈరన్న భార్య నాగలక్ష్మికి రూ.10వేలు విలువ చేసే జిగ్‌జాగ్ మిషన్‌ను అందజేశారు.

గడ్డివామి దగ్ధం

వెల్దుర్తి: బొమ్మిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన గిడ్డయ్య కల్లంలో ఏర్పాటు చేసుకున్న గడ్డివామి శనివారం దగ్ధమైంది. ఉన్నట్లుండి గడ్డివామిలో మంటలు వ్యాపించడంతో స్థానికులు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. డోన్ అగ్నిమాపక దళం సంఘటనాస్థలికి చేరుకుని ఇతర గడ్డివాములకు మంటలు వ్యాపించకుండా అదుపుచేశారు. రూ.50వేల నష్టంతో పాటు పశు గ్రాసం లేకుండా పోయిందని బాధిత రైతు వాపోయాడు.

ప్రజల మన్ననలు పొందాలి



వెంకటరాముడును సన్మానిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

తుగ్గలి : ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందినప్పుడే జీవితం సార్థక మవుతుందని తహసీల్దార్ రమాదేవి అన్నారు. సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై వెళ్తున్న బొందిమడుగుల వీఆర్వో వెంకటరాముడును ఘనంగా సన్మానించారు. శనివారం సాయంత్రం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయనను శాలువ, పూలదండలతో సన్మానించారు.

అడుగుకో గుంత..
గజానికో గొయ్యి!

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- ధ్వంసమైన లింకు రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు





అధ్వానంగా గూళ్యం-సిద్ధాపురం రహదారి

హాలహర్వి: ఏళ్లు గడుస్తున్నా గ్రామీణ రహదారులు మారడం లేదు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే లింకు రోడ్లు మరమ్మతులకు గురై ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. అడుగుకో గుంత.... గజానికో గొయ్యి మాదిరిగా ప్రస్తుత రోడ్ల పరిస్థితి ఉంది. దీంతో వాటి మీదుగా ప్రయాణించే వారంతా నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ రోడ్లపై కనీసం 14, 108 అంబులెన్స్ వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా గ్రామీణ రోడ్లకే కాదు ప్రధాన రోడ్లకు కూడా మోక్షం కలగడం లేదు. తాము అధికారంలోకి వస్తే గుంతలు లేని రోడ్లు చేసి చూపిస్తానన్న సీఎం చంద్రబాబు మాటలు ఉత్తిదేనా అని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి రోడ్లు బాగు చేయాలని కోరుతున్నారు.

గతంలో 14వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్లు..

మండలంలో మొత్తం 15 గ్రామ పంచాయతీలు ఉండగా, పంచాయతీ పరిధిలో పక్కా రోడ్ల నిర్మాణాలు జరగలేదు. గతంలో ఎస్ఆర్ఏజీఎస్, పంచాయతీ రాజ్‌తో పాటు 14వ ఆర్థిక సంఘం నిధులతో రహదారులు వేసేవారు. ప్రస్తుతం వీటి నిర్మాణం కూడా జరగక పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ముఖ్యంగా గూళ్యం-బల్లూరు, హాలహర్వి-మాచనూరు, నిట్రవట్టి-ఆలూరు, చింతకుంట-కొక్కరచేడు, చింతకుంట-సిరగాపురం, నిట్రవట్టి-గూళ్యం తదితర గ్రామాల మధ్య రోడ్డు సౌలభ్యం కనుమరుగయ్యింది. మండలంలోని మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాల నుంచి పల్లెలకు మట్టి రోడ్లపైనే ప్రజలు నడక సాగించాల్సిన దుస్థితి.



రోడ్డు పగిలిపోయి కంకర తేలిన బల్లూరు-అమృతాపురం రోడ్డు



రోడ్లు వేయడం మరిచారు



మా గ్రామానికి రోడ్డు సరిగా లేదు. కర్ణాటక సరిహద్దు ఉన్న గ్రామం కావడంతో మా గ్రామాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదు. రోడ్లు పాడై పోయాయి. ఎవరూ పట్టించుకోవడం లేదు. గ్రామంలోకి 108, 104 వాహనాలు రావడానికి కూడా ఇబ్బందిగా మారింది. కూటమి నాయకులు రోడ్లు వేస్తాయని హామీ ఇచ్చారు. కానీ నేటికీ రోడ్లను బాగు చేయలేదు. మా గ్రామం నుంచి గూళ్యం, హాలహర్వి గ్రామాలకు విద్యార్థులు చదువుకునేందుకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. – రాజప్ప, సిద్ధాపురం గ్రామస్తుడు

అత్యవసరవేళల్లో ఇబ్బందులు



నిట్రవట్టి నుంచి హొళగుందకు వెళ్లే మెయిన్ రోడ్డు వరకు ఐదు కి.మీ. వరకు రోడ్డు అధ్వానంగా మారింది. మా గ్రామం నుంచి మండలకేంద్రమైన హాలహర్వి, విరుపాపురం, బిలేహాల్, కుర్లేహళ్లి గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారింది. అత్యవసర సమయంలో వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. రోడ్లు సరిగా లేకపోవడంతో ప్రయాణించే సమయంలో కింద పడిన గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. – బసవరాజు, నిట్రవట్టి గ్రామం

రోడ్లు అధ్వానంగా ఉన్నాయి



మా గ్రామానికి దాదాపు ఐదు కి.మీ. దూరంలో హాలహర్వి మండలకేంద్రం ఉంది. విద్యార్థులు చదువుకునేందుకు నడుచుకుంటూ హాలహర్వికి వెళ్తున్నారు. రోడ్డు సరిగా లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. పాత బ్రిడ్జి కూలిపోయింది. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. వాహనాల్లో వెళ్లేటప్పుడు రోడ్డు సరిగా లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. – రంగప్పనాయుడు, మాచనూరు గ్రామం

అధ్వానంగా లింకు రోడ్లు....

మండలంలోని మాచనూరు నుంచి హర్దగేరి, చింతకుంట నుంచి సిరిగాపురం, నిట్రవట్టి నుంచి గూళ్యం, బిలేహాల్ నుంచి నిట్రవట్టి గ్రామాలకు లింకు రోడ్లు సరిగా లేవు. గ్రామాల నడుమ లింకు రోడ్ల పనులు ప్రారంభించినప్పటికీ పూర్తిస్థాయి నిర్మాణం జరగలేదు. అరకొర పనులతో సరి పెట్టేశారు. దీంతో అటు ప్రజలు, ఇటు ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

వైభవంగా గాయత్రీ మాత ఉత్సవాలు



పూజలందుకున్న గాయత్రీ మాత



హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన పంచముఖి గాయిత్రీ మాత 22వ ఆరాధనోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో అనిల్‌కుమార్‌శర్మ, రామసుబ్బయ్య శాస్త్రి, సురేంద్ర శర్మ, రూపామోహన్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, సరస్వతి పూజా, పుణ్యావచనం, గణపతి పూజా, హోమం, నవగ్రహ పూజ, కలశ స్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అంతకు ముందు రామతీర్థంలోని కొలనులో గంగకుపూజ నిర్వహించి గంగనీళ్లను మేళతాళాలతో భక్తులు అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. కార్యక్రమంలో శంకరబండ సర్పంచ్ విజయలక్ష్మి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మస్తానయ్య ఉరుసు



నలకదొడ్డిలో మస్తానయ్య స్వామిని దర్శించుకుంటున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని నలకదొడ్డి గ్రామంలో మస్తానయ్యస్వామి ఉరుసును శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ తదితర ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని ఫాతెహాలు సమర్పించారు.

సీసీరోడ్లు ప్రారంభం

మండల పరిధిలోని నలకదొడ్డి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.55లక్షలతో వేసిన సీసీరోడ్లను కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే శ్యాంకుమార్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని చెప్పారు. అలాగే తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి హంద్రీనీవా కాలువ నుంచి నీటి పైపులైన్ వేయించి ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి




ఈరన్న కుటుంబానికి నగదు అందిస్తున్న జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ నాయకులు

ఆలూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేష్ గౌడ్, గౌరవ అధ్యక్షుడు అంజి బాబు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ స్వామి డిమాండ్ చేశారు. హత్యకు గురైన అరికెర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న కుటుంబానికి ప్రభుత్వం రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. హత్యకు గురైన ఫీల్డ్ అసిస్టెంట్ బండారి ఈరన్న కుటుంబానికి జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ తరుపున రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించి ఈరన్న కుటుంబం పూర్తి బాధ్యతలు తీసుకోవాలన్నారు. ఈరన్న భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి వీరేష్, పెద్దయ్య, మల్లయ్య, సురేంద్ర, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల రైతులకు రుణాలు

తుగ్గలి : పండ్ల తోటల సాగు చేస్తున్న రైతులకు రుణాలు అందించేందుకు కేంద్ర సహకార బ్యాంకు సిద్ధంగా ఉందని ఆ బ్యాంకు పత్తికొండ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ సింగం శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండలంలోని బాటతండ, ఎల్లమ్మ గుట్టతండాతో పాటు పలు గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పండ్ల తోటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మామిడి, చీనీ, సపోట తదితర పండ్ల తోటలు సాగు చేస్తున్న రైతులకు కేడీసీసీ బ్యాంకు ద్వారా తక్కువ వడ్డీతో ఎకరాకు రూ.3లక్షల రుణం అందిస్తామన్నారు.

ఘనంగా దస్తగిరి స్వామి ఉరుసు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

ఆస్పరి: మండలంలోని ములుగుందంలో వెలసిన దస్తగిరి స్వామి 269 ఉరుసు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం తెలవారుజామున దస్తగిరి స్వామి గుర్రాన్ని అందంగా అలంకరించి గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు స్వామి వారి గుర్రానికి బిందెలతో నీళ్లు పోసి పూజించారు. గుర్రం దర్గాకు వచ్చే వరకు భక్తులు వెంట నడిచారు. దస్తగిరి స్వామి సమాధి, ఆయన వంశస్తుల సమాధులను ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి సమాధి వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్యామలమ్మ, కృష్ణమూర్తి, నర్సిరెడ్డి, చిన్నాయప్ప స్వామి వంసస్తులు ముస్తాన్ పీరా సాహెబ్, రోషన్‌పీర్ సాహెబ్, అహ్మద్ హుసేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ములుగుందంలోని దర్గాలో దస్తగిరి స్వామిని ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, భీమన్న, రాముడు, హనుమంతు పాల్గొన్నారు.



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

పరిశుభ్రతతోనే గ్రామాల అభివృద్ధి



పత్తికొండలో స్వచ్ఛతా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్, ఆర్డీఓ, అధికారులు, సిబ్బంది

పత్తికొండ రూరల్ : పరిసరాలు శుభ్రంగా ఉంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ అన్నారు. శనివారం పత్తికొండలోని మేజర్ గ్రామపంచాయతీ ఈఓ నరసింహులు ఆధ్వర్యంలో స్వచ్ఛతా దివస్ ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ భరత్‌నాయక్, గ్రామపంచాయతీ సర్పంచు కొమ్ముదీపిక, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, సీఐ జయన్న, ఎస్ఐ గోపాల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కేడీసీసీ బ్యాంకు ఆవరణంలో బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి స్వచ్ఛత దివస్ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు.

- **మద్దికెర** : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి స్వచ్ఛతే కర్తవ్యంగా విధులు నిర్వహిస్తామని జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, ఎంపీడీఓ కొండయ్య, సర్పంచ్ సుహాసిని అన్నారు. శనివారం మండల కేంద్రమైన మద్దికెరలో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక చెత్త సంపద కేంద్రం వద్ద ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏఈలు మయాంక్, ఉమాకాంత్ మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, పంచాయతీ సభ్యులు లక్ష్మీనారాయణ, బాలచంద్ర పాల్గొన్నారు.
- **హాలహర్వి:** పట్టణాలు, గ్రామాలు పరిశుభ్రంగా ఉంచడమే ప్రభుత్వ లక్ష్యమని విద్యుత్‌శాఖ జేఈ జంబన్న అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో విద్యుత్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.
- **ఆస్పరి:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పత్తికొండ డీఎల్‌పీఓ వీరభద్రప్ప, తహసీల్దార్ రామేశ్వరరెడ్డి, ఎంపీడీఓ గీతావాణి సూచించారు. శనివారం ఆస్పరిలో స్వచ్ఛంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమం సర్పంచ్ మూలింటి రాధమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతకుముందు ఆస్పరిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని డీఎల్‌పీఓ, ఎంపీడీఓ పరిశీలించారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీఓ, పంచాయతీ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది శుభ్రం చేశారు.
- **ఆలూరు రూరల్:** పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఈఓపీఆర్డీ ప్రభాకర్ అన్నారు. స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని ఆలూరు, అరికెర, కురువళ్లి తదితర గ్రామాల్లో పరిసరాలు శుభ్రం చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆలూరు పట్టణంలో పారిశుద్ధ్య కార్మికులతో ర్యాలీ నిర్వహించారు.
- **తుగ్గలి** : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సబ్‌స్టేషన్ ఆవరణలో పిచ్చి మొక్కలు, రాలిన ఆకులను తొలగించి చెత్త చెదారాన్ని శుభ్రం చేశారు. విద్యుత్ శాఖ ఏఈ మహేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కృష్ణగిరి: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్ఐ మల్లికార్జున పిలుపునిచ్చారు. శనివారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు.

- **వెల్దుర్తి:** చెత్తను సేకరించి సంపదను సృష్టించడం ద్వారా పంచాయతీకి ఆదాయం పెరుగుతుందని ఎంపీడీఓ సుహాసిని అన్నారు. శనివారం ఆమె ఈఓఆర్డీ రవికిశోర్‌తో కలిసి స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్‌లో భాగంగా గోవర్ధనగిరిలో పారిశుద్ధ్య పనుల పరిశీలించారు. కళాజాతా బృందంతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించి, పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సీఐ మధుసూదన్ రావ్, ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పాత స్టేషన్ భవనం చుట్టుపక్కల పరిశుభ్రత పనులు చేపట్టారు.
- **దేవనకొండ:** పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని ఈఓఆర్డీ సూర్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని మాచాపురం గ్రామంలో స్వచ్ఛ దివాస్‌లో భాగంగా చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పునః ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకృష్ణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆలూరు రూరల్: ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కూలీలకు పెండింగ్‌లో ఉన్న ఏడు వారాల వేతనాలు చెల్లించాలని సీపీఐఎంఎల్ జిల్లా నాయకులు మునిస్వామి డిమాండ్ చేశారు. మండలంలోని పెద్ద హోతూరు గ్రామ సచివాలయం వద్ద శనివారం ఉపాధి కూలీలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది రమేష్‌కు వినతి పత్రం అందించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బి.విరూపాక్షి

దేవనకొండ: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే బి.విరూపాక్షి అన్నారు. మండలంలోని బి.సెంటర్ గ్రామంలో శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షులు శశికళతో కలిసి పర్యటించారు. గ్రామంలోని కార్యకర్తలు, నాయకులు, ప్రజలతో సమస్యలపై చర్చించారు. అనంతరం గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉరుకుంద కుమార్తె వివాహ రిసెప్షన్‌లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఎలాంటి కష్టం వచ్చినా ఆదుకుంటానని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, జెడ్పీటీసీ కిట్టు, కో కన్వీనర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే మలేరియా పరీక్షలు



రికార్డులు తనిఖీ చేస్తున్న జోనల్ అధికారి

మద్దికెర : మలేరియా వ్యాధికి ఇంటి వద్దే పరీక్షలు చేసి చికిత్సలు అందించాలని మలేరియా జోనల్ అధికారి డాక్టర్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక వైద్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, మలేరియాకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో వైద్యసిబ్బంది ప్రతి శుక్రవారం పర్యటించి డ్రైడే పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా అవగాహన కల్పించి ఆర్‌డీటీ కిట్ల ద్వారా ఫీవర్ సర్వే చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి, సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సేవాఘడ్‌కు తరలిన తండావాసులు

తుగ్గలి : బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంత్యూత్సవాలకు పత్తికొండ, తుగ్గలి మండలాల్లోని తండావాసులు శనివారం గుత్తి మండలంలోని సేవాఘడ్‌కు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. సేవాలాల్ మహరాజ్‌ను బంజరాలు కారుణ జన్ముడిగా ఆరాధిస్తారు. తండాల్లోని సేవాలాల్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్న అనంతరం ఉత్సవాలకు తరలి వెళ్లారు. సేవాఘడ్‌లో సేవాలాల్‌ను భక్తిశ్రద్ధలతో దర్శించుకుని

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

పత్తికొండ(తుగ్గలి) : ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ ప్రారంభ మయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో శనివారం ఉదయం, సాయంత్రం రెండు సెషన్లుగా పరీక్షలను నిర్వహించారు. సైన్స్ విభాగంలో సెకండియర్ విద్యార్థులు, ఒకేషనల్‌లో ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులు మొత్తం 80 మందికి పరీక్షలు నిర్వహించారు. తుగ్గలి, పత్తికొండకు చెందిన కేజీబీవీ, మోడల్ స్కూల్, ప్రైవేటు కాలేజీ విద్యార్థులు సైన్స్ విభాగంలో 153, ఒకేషనల్ విద్యార్థులు 213 మంది ప్రాక్టికల్ పరీక్షలు రాస్తున్నారు. పరీక్షలు ఈనెల 19వ తేదీతో ముగుస్తాయని కళాశాల ప్రిన్సిపాల్ నయీమున్నిసా బేగం తెలిపారు.



ఎల్ఎల్‌సీ కాలువపై సైడ్‌వాల్స్ లేని దృశ్యం

ఆదమరిస్తే కాలువలోకే..

హాలహర్వి: మండలంలోని పచ్చారపల్లి, నిట్రవట్టి, బాపురం గ్రామాల సమీపంలో ఉన్న ఎల్ఎల్‌సీ కాలువ కాలినడకన బ్రిడ్జిల వద్ద సైడ్ వాల్స్ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జి దాటే సమయంలో ఏమరపాటుగా ఉంటే కాలువలో పడితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ఈ బ్రిడ్జిల మీదుగానే ఎద్దులబండ్లు, బైకులు తిరుగుతుంటాయి. గతంలో ఇక్కడ ఎద్దులు, మనుషులు నీరు తాగేందుకు దిగి కొట్టుకుపోయిన ఘటనలు ఉన్నాయి. అలాగే హెచ్చరిక బోర్డులు కూడా లేవు. సంబంధిత తుంగభద్ర ఎల్ఎల్‌సీ కాలువ అధికారులు స్పందించి బ్రిడ్జిలపై సైడ్ వాల్స్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.